క్లుప్తంగా

లక్ష్మీనారాయణులకు ఘనంగా అభిషేకం



శ్రీ లక్ష్మీనారాయణులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కొమ్మాది : స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో సోమవారం శ్రీ లక్ష్మీ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మ ముహూర్తంలో శ్రీ అష్టలక్ష్మి హోమం నిర్వహించి ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణసేవ, సువర్ణ పుష్పార్చన, పుష్పాభిషేకం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచార సభ – చెన్నై ఆధ్వర్యంలో గత నెల ఫిబ్రవరిలో నిర్వహించిన లోయర్ పరీక్షలకు సంబంధించి సర్టిఫికెట్లను విద్యార్థులకు సోమవారం అందించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, కొక్కిరి అప్పన్న సమక్షంలో వీటిని అందించారు. ఈ సందర్భంగా వీరు హోలీ పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం : మండలంలోని తునివలసలో సోమవారం తొలేళ్లతో బంగారమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి గ్రామంలో రథాల ఉత్సవం నిర్వహించారు. వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది గ్రామంలో మూడు సార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

స్థిరమైన అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాష్ట్ర భవిష్యత్ కోసం వైఎస్సార్ సీపీని గెలిపించండి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గిడిజాలలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్ర భవిష్యత్ కోరుకునే ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గిడిజాల, ముచ్చర్ల గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ పాలనలో పరిపాలనను గాలికి వదిలేసి జన్మభూమి కమిటీలకు పెత్తనం అప్పగించడంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా పదవి చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనతను సాధించారన్నారు. దీనివల్ల రాష్టంలో పేదలు, ధనికులు మధ్య వ్యత్యాసం తగ్గిందన్నారు. పింఛన్ మొత్తం పెంచడం వల్ల ఏ ఆసరాలేని వారికి ఆర్థిక దన్నుగా నిలిచిందన్నారు. అవినీతికి, అక్రమాలకు అవకాశం లేకుండా పరిపాలన సాగిస్తుండడంతో గ్రామాలు గణనీయమైన అభివృద్ధి సాధించాయన్నారు. ప్రజల అవసరాలు ఇంటి వద్దే పరిష్కరించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీకి ఓటేస్తే మరలా రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రజలు గమనించాలని కోరారు. ముచ్చర్లలో సచివాలయం ఏర్పాటకు చర్యలు తీసుకుంటామని, ఇనాం భూములపై పూర్తి స్థాయి సర్వే చేయించి రైతులకు హక్కులు కల్పిస్తామని చెప్పారు. సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడకే వచ్చి పరిష్కరిస్తానన్నారు. ఐదేళ్ల పాలనలో తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నించానని చెప్పారు. గ్రామాలకు మంచి జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ముచ్చర్ల ఎంపీటీసీ సభ్యుడు గుసిడి ముత్యాలు, సర్పంచ్‌లు షిణగం అప్పలరాజు, షిణగం యర్రయ్య, నాయకులు కోరాడ ముసిలి నాయుడు, పాండ్రంకి అప్పారావు, బొట్టా రామకృష్ణ, రౌతు వెంకటరావు, గండ్రెడ్డి శ్రీనివాసరావు, పిన్నింటి వెంకటరమణ, జోల దేవుడు, షిణగం రాంబాబు, కోండ్రోతు అప్పలనారాయణ, మజ్జి వెంకటరావు, లెంక రాంబాబు, గంగరాజు, గుసిడి వెంకట రమణ, చందక అప్పలస్వామి, ఇల్లాపు వెంకటరావు, గండ్రెడ్డి ఆనంద్, గొరపల్లి సత్యనారాయణ, కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబువన్నీ ఉత్తుత్తి హామీలే



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలిలో ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీనే గెలిపించండి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: దేశంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే ఆ సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. సోమవారం సాయంత్రం మత్స్యకారులు నివసించే ఎగువపేట ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేద ప్రజల సంక్షేమంపై దృష్టి సారించారన్నారు. పథకాల లబ్ధిని అర్హులకు నేరుగా అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చారని కొనియాడారు. ఎక్కడా అవినీతి, పక్షపాతం లేకుండా అర్హులందరికీ పథకాలు అందించారని కొనియాడారు. ఇంతటి గొప్ప పాలనకు ప్రజలంతా బ్రహ్మరథం పడుతుంటే ఏం చేయాలో అర్థంకాని చంద్రబాబునాయుడు వీటికన్నా ఎక్కువ పథకాలు అందిస్తానని హామీలిస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే అవన్నీ ఉత్తుత్తి హామీలేనని, వాటిలో ఒకటి కూడా చంద్రబాబు అమలు చేయడని, బాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. మత్స్యకారులకు మేలు జరిగింది ఈ ప్రభుత్వంలోనేనన్నారు. రానున్న ఎన్నికల్లో గెలవగానే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. విశాఖ పరిపాలన రాజధానిగా మారడంతో ఈ ప్రాంతం ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో తాను ఎన్నో అభివృద్ధి పనులు చేయించానని గుర్తు చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, జి.మధునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీ, బింగి హరికిరణ్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు అమ్మవార్ల అనుపోత్సవం నేడు



విద్యుత్ దీప కాంతులతో సంగివలసలోని ముగ్గురు అమ్మవార్ల ఆలయం



పైడితల్లమ్మకు గాజులు, చీరలు, దండలతో అలంకరణ

తగరపువలస : సంగివలస ముగ్గురు అమ్మవార్లకు మంగళవారం అంగరంగ వైభవంగా అనుపోత్సవం నిర్వహించేందుకు దేవదాయశాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. వార్షిక ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా వుండే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసింది. సర్వీస్ రోడ్డు, జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పార్కులో వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. పార్కు నుంచే భక్తుల రాకపోకలకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి వివిధ నేల వేషాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను సంగివలస గ్రామంలో కూడా నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పైడితల్లమ్మ వార్షిక అనుపోత్సవం కూడా మంగళవారం నిర్వహించనున్నారు. అంతదూరం వెళ్లలేని భక్తులు చిట్టివలస మేకల వారి కళ్లాల వద్ద వేపచెట్టు ముందు అమ్మవారి రూపానికి గాజులు, గజమాలలు, పసుపు కుంకుమ, పట్టుచీరలతో సోమవారం సాయంత్రమే అలంకరణ పూర్తి చేశారు. మంగళవారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వేపచెట్టు వద్దే పైడితల్లమ్మకు మొక్కులు చెల్లించుకోనున్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. కొవ్వాడ, గంధవరం పంచాయతీల్లో ప్రచారం చేస్తారని, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

భక్తితో శ్రీ సాయి రుద్ర హోమం

పీఎం పాలెం : స్థానిక రామాలయం వద్ద గల శ్రీసత్య సాయిబాబా ఆలయ ప్రాంగణంలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సాయీశ్వర రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

27న శివాలయ వార్షికోత్సవం

పీఎం పాలెం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ బబ్బేలమ్మ సహిత కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం 27న బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ తెలిపారు. అనంతరం పల్లకిలో ఊరేగింపు నిర్వహించిన తర్వాత పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిపిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు కొత్త బస్సులు ప్రారంభించండి

తగరపువలస : రాష్ట్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ ఇటీవల కొనుగోలు చేసిన 80 కొత్త బస్సులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న సంస్థ వైస్ చైర్మన్ సీహెచ్.ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే అద్దె బస్సుల సాయంతో ప్రజారవాణా ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాలం చెల్లిన బస్సులను నిలిపివేయాలని కోరారు.

నేటి మధ్యాహ్నం నుంచి వేంకటేశ్వరుని దర్శనాలు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న ఆలయ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేయనున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప జన్మ నక్షత్ర వేడుకలు



పద్మనాభం జంక్షన్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు

పద్మనాభం: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర వేడుకలను మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మద్దిలోని శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం అయ్యప్పహోమం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పద్మనాభం జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అయ్యప్ప స్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మ నక్షత్ర వేడుకలు నిర్వహించారు. భక్తులు అయ్యప్ప చరణాలను ఆలపించారు. ఈ సందర్భంగా 110 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు ఆల్తి రాజు, కె.పద్దరాజు, డి.రమణ, ఎన్.ఉపేంద్ర, సీహెచ్.శ్రీను పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉయ్యాల ఉత్సవం



ఉత్సవ విగ్రహాలకు ఉయ్యాల ఉత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



చక్ర పెరుమాళ్లకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి ఉయ్యాల ఉత్సవం సోమవారం డోలా మండపం వద్ద ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా పల్లకీలో పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా వద్ద ఉన్న డోలా మండపానికి తీసుకెళ్లారు. విశేష పూజల అనంతరం ఉభయ దేవేరులతో అనంత పద్మనాభ స్వామికి ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. స్వామి ఉయ్యాల ఊపడానికి భక్తులు పోటీపడ్డారు. తదుపరి చక్రపెరుమాళ్లను పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి పుష్కరిణి (కన్నయ్య కోనేరు) గట్టు వద్దకు తోడ్కొని వెళ్లారు. ఇక్కడ చక్ర పెరుమాళ్లకు వేద పండితులు, అర్చక స్వాములు చక్రస్నానం చేయించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పైడిరాజు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, మొకర సన్నిబాబు, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు. భక్తులంతా ఒకరిపై ఒకరు ఆనందంతో రంగులు జల్లుకున్నారు.

ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



ఇంటింటా ప్రచారంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, తదితరులు



మానం ఆంజనేయులు నగర్‌లో ఎన్నికలు ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: మధురవాడలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన అభ్యర్థులు ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో కాలనీలు అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మానం ఆంజనేయులు నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, గౌరవ అధ్యక్షుడు ప్రతాపరాజు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, నాయకులు పిళ్లా నూరిబాబు, శ్రీదేవి, తమ్మినేని వరలక్ష్మి, మగ్గూరి వెంకటరావు, జగ్గుపిళ్లి సాయి, ఎస్.నాగభూషణరావు, అల్లాడ వెంకటరావు పాల్గొన్నారు.

సంతపేటలో ఇంటింటా ప్రచారం

తగరపువలస : వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. జీవీఎంసీ ఒకటో వార్డులో నాయకులు, కార్యకర్తలు ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, సిమ్మల ప్రసన్న, జి.సృజన తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య మహాప్రభు జయంతి వారోత్సవాల ముగింపు



బలరామ కృష్ణులకు పుష్పాలతో అభిషేకం చేస్తున్న నిర్వాహకులు

ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీచైతన్య మహాప్రభు జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బలరామ కృష్ణులకు అంగరంగ వైభవంగా అభిషేకాలు, హోళికా దహనం, మహా మంగళ హారతి, పుష్పాలతో హోలీ ఉత్సవం నిర్వహించారు. నగరంలోని వివిధ గృహాల్లో పూజించిన 100 నితాయి గౌరంగ విగ్రహాలను తీసుకొచ్చి పూజ చేసే విధానం వివరించారు. 1486లో పశ్చిమ బెంగాల్‌లో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు అవతరించారన్నారు. హరేకృష్ణ మహామంత్రంతో కూడిన హరినామ సంకీర్తనను భారతదేశమంతటా ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో అంబరీష దాస, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే ముస్లింలకు మేలు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

భీమునిపట్నం : జగనన్న ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎక్కడా లేని విధంగా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని, ఇది చాలా గొప్ప విషయమన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా వారికి ఎన్నో విధాలుగా మేలు చేస్తున్నారని, అందువల్ల ముస్లింలంతా ఆయనకు అండగా నిలవాని కోరారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. రాష్ట్ర మైనారిటీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, ఉపాధ్యక్షుడు ఫరూక్, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముస్తఫా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బర్కత్ అలీ, ముఖ్య సభ్యులు అస్లాం ఖాన్, బషీర్, జమాల్ పాల్గొన్నారు.

వలంటీర్లను విమర్శించడం దారుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఎంతో నిజాయతీగా కష్టపడి పని చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చి విమర్శించడం దారుణమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. కొందరు ప్రతిపక్ష నాయకులు వలంటీర్లను తీవ్రవాదులకు సహకరించే స్లీపర్ సెల్స్‌తో పోల్చడం దారుణమన్నారు. కరోనా మహమ్మారి సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని, ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదు అందించడంతోపాటు ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అటువంటి వారిని ఇంత నీచంగా విమర్శించడం చాలా తప్పని, ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

దాడిలో యువతికి గాయాలు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో నలుగురు మహిళల మధ్య తలెత్తిన వివాదంలో ఓ యువతికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాంబేకాలనీలో నివసిస్తున్న నాగమల్లేశ్వరి గుడి ఎదురు బ్లాకు 37బి, ఎఫ్‌ఎఫ్10లో దాసరి భాను కుటుంబం నివసిస్తున్నారు. సమీపంలో వుంటున్న ఈశ్వరితో పప్పులు చీటీలు, ఇతర ఆర్థిక వ్యవహారాల్లో వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇరు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఈ గొడవలో దాసరి భాను కుమార్తె ఉష(20)కి తలపై గాయమైంది. బాధితులు పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్యం నిమిత్తం పోలీసులు గీతం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమార్తెను కొట్టడమే కాకుండా మెడలో ఉన్న మూడు తులాలు బంగారు చైను కూడా పట్టుకుపోయినట్టు భాను తెలిపారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో లింగేశ్వరరావుకు బంగారు పతకాలు



గోల్డ్ మెడల్స్, షీల్డులతో లింగేశ్వరరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బీవీఎస్‌కే లింగేశ్వరరావు రెండు బంగారు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హర్యానా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ – సన్‌రైజ్ 46వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 23 వరకు జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు చెందిన 1,780 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. లింగేశ్వరరావు డబుల్స్ 55+ కేటగిరీలో చెన్నైకు చెంది డాక్టర్ మారన్ తంగవేలుతో పోటీ పడి బంగారు పతకం సాధించారు. అదే విధంగా 55+ మిక్స్‌డ్ కేటగిరీలో పూణేకు చెందిన రాజశ్రీ భావేతో పాల్గొని మరో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు బంగారు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడు లింగేశ్వరరావు కావడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయనను ఉక్కు అధికారులు, పలువురు క్రీడాకారులు, పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.